క్లుప్తంగా

మినీ వాటర్ ట్యాంక్ నిర్మాణం



నున్న(విజయవాడరూరల్): నున్న గ్రామం వాగు సెంటర్లో నివసిస్తున్న ప్రజల సౌకర్యార్థం ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్ సూచనల మేరకు తాగునీటి మినీ ట్యాంక్ నిర్మాణం పనులు జరుగుతున్నాయి. ఇటీవల నున్న గ్రామం వచ్చిన ఎమ్మెల్యే వంశీమోహన్‌ను ఆ ప్రాంతంలోని మహిళలు తాగునీరు అందుబాటులో లేక ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. ఈ సమస్యపై వెంటనే స్పందించిన ఎమ్మెల్యే తాగునీటి ట్యాంక్ నిర్మించాలని సంబంధిత అధికారులకు సూచించారు. వారం రోజుల్లోనే పనులు ప్రారంభించి ట్యాంక్‌కు శ్లాబు వేశారు. ఫినిషింగ్ పనులు పూర్తి చేసి ట్యాంక్ ప్రారంభిస్తామని పంచాయతీ కార్యదర్శి జీటీవీ రమణ తెలిపారు. గ్రామ పంచాయతి సాధారణ నిధులు రూ.3 లక్షలతో ఐదువేల లీటర్ల సామర్థ్యం కలిగిన ట్యాంకు నిర్మించామన్నారు.

రోడ్డు ప్రమాదంలో డెలివరీ బాయ్‌కి గాయాలు

పెనమలూరు: కానూరు వందడుగుల రోడ్డులో జరిగిన రోడ్డు ప్రమాదంలో డెలివరీ బాయ్‌కి గాయాలు అవ్వంతో పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. యనమలకుదురు డొంకరోడ్డుకు చెందిన కట్టా రాంబాబు డెలివరీబాయ్‌గా పని చేస్తున్నాడు. అతను సోమవారం సామాను డెలివరీ చేయటానికి బైక్‌పై కానూరు వందడుగుల రోడ్డులో వెళుతుండగా ఎదురుగా వచ్చిన లారీ ఢీ కొట్టింది. ఈ ఘటనలో గాయపడిన రాంబాబును 108 వాహనంలో విజయవాడ ప్రభుత్వాస్పత్రిలో చేర్చారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

పేద విద్యార్థినికి సాయం



కంకిపాడు: పేద విద్యార్థులకు చేయూత అందిస్తే అద్భుతాలు సృష్టిస్తారని ఇంజినీరు, ధనేకుల ఇన్‌స్టిట్యూట్ మెకానికల్ విభాగం హెచ్‌ఓడీ రావి సురేష్‌బాబు అన్నారు. మండలంలోని మద్దూరు గ్రామానికి చెందిన పేద విద్యార్థిని పాతూరి పావని చదువు నిమిత్తం రూ.5 వేలు నగదు, నిత్యావసరాలు మంగళవారం అందించారు. సురేష్‌బాబు మాట్లాడుతూ విద్యార్థికి అవసరమైన జాబ్ కౌన్సిలింగ్, స్కిల్స్ ట్రైనింగ్, పుస్తకాలను అందిస్తున్నామన్నారు. ప్రతిభావంతులైన విద్యార్థులకు అండగా నిలుస్తామన్నారు. కార్యక్రమంలో స్థానిక ప్రతినిధులు రావి సాంబశివరావు, రావి అప్పారావు, రావి నాంచారయ్య, యనమదల శ్రీనివాసరావు, రావి వాసు పాల్గొన్నారు.

పోరంకిలో బైక్ ర్యాలీ



పెనమలూరు: మోదీని గద్దె దించండి-దేశాన్ని కాపాడండి నినాదంతో బుధవారం విజయవాడలో చేపట్టిన మహాధర్నాను అన్ని వర్గాల ప్రజలు విజయవంతం చేయాలని మండల సీఐటీయూ అధ్యక్ష,కార్యదర్శులు షేక్ మస్తాన్ వలి, ఉప్పాడ త్రిమూర్తి అన్నారు. తాడిగడప మున్సిపాలిటీ పరిధి మానికొండ సుబ్బారావు, సూర్యవతి కార్మిక కార్యాలయం నుంచి మంగళవారం పోరంకి, కానూరు, కొత్త ఆటోనగర్, తాడిగడప, యనమలకుదురు వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ క్విట్ఇండియా స్ఫూర్తితో మోడీని గద్దె దించాలన్నారు. దీనికి అన్ని వర్గాల ప్రజలు ముందుకురావాలని పిలుపునిచ్చారు. నేతలు షేక్ కాశిం, వాతపల్లి శ్రీరాములు, కొండబాబు, అన్నవరపు శ్రీనివాసరావు, గంజి నరసయ్య, వెంకటరెడ్డి పలువురు పాల్గొన్నారు.

పూరిల్లు దగ్ధం

హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు మండలం రంగన్నగూడెంలో బాణసంచా కాల్చుతుండగా ప్రమాదవశాత్తూ ఓ పూరిల్లు దగ్ధమైంది. గ్రామంలో మంగళవారం జరిగిన అంతిమయాత్ర సందర్భంగా టపాసులు పుసులూరు గోపాలరావుకు చెందిన తాటాకు ఇంటిపై పడ్డాయి. దీంతో ఇంటిపైకప్పు నుంచి ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. ఇరుగుపొరుగు వారు హనుమాన్‌జంక్షన్ అగ్నిమాపకశాఖ అధికారులకు సమాచారం ఇవ్వడంతో సిబ్బంది మంటలను అదుపు చేశారు. ఇంట్లోని సామాగ్రి పూర్తిగా కాలిపోయింది. గోపాలరావు కుటుంబ సభ్యులు కట్టుబట్టలతో మిగిలారు. సుమారు రూ.2.50 లక్షల మేరకు ఆస్తినష్టం జరిగినట్లు ఫైర్ ఆఫీసర్ జి.ఆర్.రామ్మోహనరావు పాల్గొన్నారు.

సంక్షేమ పాలనతో ఆర్థిక ప్రగతి

- ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి
- ఉయ్యూరు 9వ వార్డులో గడప గడపకు మన ప్రభుత్వం

ఉయ్యూరు: సంక్షేమ పాలనలో రాష్ట్రంలో ప్రజల ఆర్థిక స్థితిగతులు మెరుగు పడుతున్నాయని ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి అన్నారు. పట్టణంలోని నాలుగో వార్డు సచివాలయ పరిధిలో 9వ వార్డులో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఎమ్మెల్యే పార్థసారథి ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పాలన వివరించారు. ఆయా కుటుంబాలకు చేకూరిన లబ్ధి వివరాలతో రూపొందించిన బ్రోచర్లను అందజేశారు. ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ సంక్షేమ పాలనపై అభిప్రాయాలను సేకరించారు. ఈ సందర్భంగా పలువురు మహిళలు టిడ్కో గృహాల సమస్యను వివరించారు. ఎమ్మెల్యే పార్థసారథి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చి వలంటీర్ల ద్వారా సంక్షేమ పథకాలను అర్హులకు అందేలా చేయడంతో ప్రజలకు లబ్ధి జరుగుతుందన్నారు. ఎక్కడా అవినీతికి ఆస్కారం లేకుండా ఆర్థికంగా అభ్యున్నతి సాధించేలా చర్యలు తీసుకుంటుందన్నారు. ఉయ్యూరు పట్టణంలో సంక్షేమంతో పాటు, అభివృద్ధి పనులు కూడా చేపడుతూ ప్రజలు మెచ్చే పాలన చేస్తున్నామన్నారు. టిడ్కో గృహాల సమస్యను త్వరలోనే పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ వల్లభనేని సత్యనారాయణ (నాని), వైస్ చైర్మన్ అర్షతున్నీసాబేగం, కమిషనర్ పాయసం వెంకటేశ్వరరావు, కౌన్సిలర్లు ఊర శ్రీవాణి, వడుపు గంగాభవాని, ప్రభుత్వాసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ జంపాన కొండలరావు, నాయకులు ఊర కిషోర్, ఊర నాగిన్, వడుపు కార్తీక్, రాజులపాటి రామచంద్రరావు, షేక్ అబు కలాం, అబ్దుల్ సద్దాం, సీహెచ్ కుటుంబరాజు, పలువురు ప్రజాప్రతినిధులు, పార్టీ నేతలు పాల్గొన్నారు.



లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి

నైపుణ్య ప్రదర్శనకు ఇన్‌స్పైర్ వేదిక

డీఈఓ తాహేరాసుల్తానా

పెనమలూరు: విద్యార్థులు నైపుణ్యం, సృజనను ప్రదర్శించటానికి ఇన్‌స్పైర్ వేదికగా ఉపయోగపడుతుందని జిల్లా విద్యాశాఖ అధికారిణి తాహేరాసుల్తానా అన్నారు. గంగూరు ధనేకుల ఇంజినీరింగ్‌కాలేజీలో మంగళవారం గుడివాడ డివిజన్ విజ్ఞాన శాస్త్ర ఉపాధ్యాయులకు ఒక రోజు ఇన్‌స్పైర్, ఇతర సైన్స్ అంశాలపై ఓరియంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈఓ తాహేరాసుల్తానా మాట్లాతూ జిల్లాలో అందరు సైన్స్ ఉపాధ్యాయులు తప్పనిసరిగా ప్రతి పాఠశాల నుంచి ఐదుగురు విద్యార్థులను ఎంపిక చేయాలని సూచించారు. నామినేషన్లు ఈ నెల 31వ తేదీ లోపు పూర్తి చేయాలని ఆదేశించారు. కృష్ణా జిల్లాను అగ్రగామిగా నిలపాలన్నారు. గుడివాడ ఉప విద్యాశాఖ అధికారి ఐ.పద్మారాణి మాట్లాడుతూ పాఠశాలలో విద్యార్థులను ఏ విధంగా ఎంపిక చేయాలో ప్రమాణాలు సూచించారు. ఈ కార్యక్రమంలో ధనేకుల ఇంజినీరింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కడియాల రవి, జిల్లా సైన్స్ అధికారి మొహమ్మద్ జాకీర్ అహ్మద్, అధ్యాపకుడు రావిసురేష్‌బాబు, ఎంఈఓ-2 కనకమహాలక్ష్మి, రిసోర్స్ పర్సన్స్ బి.సురేష్, డి.శ్రీనివాస్, కేవీఎస్.ఈశ్వరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



గంగూరులో ఇన్‌స్పైర్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న డీఈఓ తాహేరాసుల్తానా

ఘనంగా అణుబాంబు వ్యతిరేక దినోత్సవం



ర్యాలీ చేస్తున్న విద్యార్థులు

నున్న(విజయవాడరూరల్): ఎన్టీఆర్ జిల్లా విద్యాశాఖాధికారి సీవీ రేణుక ఆదేశాల మేరకు మంగళవారం జిల్లా పరిషత్ హైస్కూల్ నున్న లో జిల్లా సైన్స్ అధికారి మైనం హుస్సేన్ ఆధ్వర్యంలో ఆప్కాస్ట్, ఎన్టీఆర్ జిల్లా విద్యాశాఖ సంయుక్తంగా హిరోషిమా అండ్ నాగసాకి దినోత్సవంను అణుబాంబు వ్యతిరేక దినోత్సవం నిర్వహించారు. విద్యార్థులు ప్రధాన వీధుల్లో ర్యాలీ చేశారు. 8, 9 తరగతుల విద్యార్థులకు డ్రాయింగ్, క్విజ్ పోటీలను నిర్వహించారు. విజేతలకు బహుమతులు, సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా హుస్సేన్ మాట్లాడుతూ అణుశక్తిని రెండో ప్రపంచ యుద్ధ కాలంలో హిరోషిమా, నాగసాకి నగరాల వినాశనానికి ఉపయోగించారని, అలా కాకుండా మానవాళికి అందరికి అవసరమైన విద్యుత్ తయారీకి న్యూక్లియర్ రియాక్టర్‌ను కనుగొన్న ఎన్రికోఫెర్మి కృషికి నివాళి అర్పించారు. ఇటువంటి శాస్త్రవేత్తలను ఆదర్శంగా తీసుకొని విద్యార్థులు అందరూ మానవాళి అభివృద్ధికి కృషిచేసి శాస్త్రవేత్తలుగా ఎదగాలని కోరారు. కార్యక్రమంలో హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు వి.భూపాల్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేటి నుంచి 'నా భూమి-నాదేశం'

కంకిపాడు: ప్రజల్లో దేశభక్తిని ప్రేరేపించేందుకు ఆజాదీకా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా ఈనెల బుధవారం నుంచి నా భూమి-నాదేశం, నేల తల్లికి నమస్కారం-వీరులకు వందనం.. కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు ఇన్‌చార్జి ఎంపీడీఓ టి.ఉదయ్‌భాస్కర్ తెలిపారు. మంగళవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. అన్ని గ్రామ పంచాయతీలు, మండల కేంద్రాల్లో ఆజాదీకా అమృత్ మహోత్సవ్ కార్యక్రమాలు నిర్వహించాల్సి ఉందన్నారు. ఈనెల 9వ తేదీన కోలవెన్ను, మంతెన, మారేడుమాక, ఉప్పలూరు, దావులూరు, 10వ తేదీన ఈడుపుగల్లు, కుందేరు, మద్దూరు, కందలంపాడు, జగన్నాథపురం, 11వ తేదీన వేల్పూరు, పునాదిపాడు, నెప్పల్లి, చలివేంద్రపాలెం, గొల్లగూడెం, 14వ తేదీన కంకిపాడు, ప్రొద్దుటూరు, తెన్నేరు, గొడవర్రు, కాసరనేనివారిపాలెం గ్రామాల్లో కార్యక్రమాలు జరుగుతాయన్నారు. ఆయా కార్యక్రమాలకు తహసీల్దార్, ఇన్‌చార్జి ఎంపీడీఓ, ఎంఈఓ, మండల వ్యవసాయాధికారి, మండల ఉద్యానశాఖ అధికారి నేతృత్వంలో బృందాలను ఏర్పాటు చేశామని వివరించారు. నిర్దేశించిన షెడ్యూల్ ప్రకారం కార్యక్రమాలు జరిగేలా చర్యలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు.

హనుమాన్‌జంక్షన్ రూరల్: మండలంలో బుధవారం నుంచి ప్రతి గ్రామ పంచాయతీలో 'నా భూమి-నాదేశం', 'నేల తల్లికి నమస్కారం-వీరులకు వందనం' కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు బాపులపాడు ఎంపీడీవో కె.జోగేశ్వరరావు మంగళవారం తెలిపారు. దీనిలో భాగంగా ప్రభుత్వ కార్యాలయాల వద్ద మొక్కలు నాటడం, స్థానిక స్వాతంత్య్ర సమరయోధులను సత్కరించటం, జెండా వందనం, మట్టి, దీపాన్ని చేతిలో పట్టుకుని ప్రతిజ్ఞ చేయటం, అమరవీరుల కుటుంబ సభ్యులను ఆహ్వానించటం వంటి కార్యక్రమాలు గ్రామస్థాయిలో నిర్వహించనున్నట్లు చెప్పారు. గ్రామాల వారీగా ఈ కార్యక్రామలను నిర్వహించేందుకు ప్రత్యేక అధికారులను నియమించినట్లు తెలిపారు.

ఉంగుటూరు: ఆజాదీకా అమృత మహోత్సవ్‌లో భాగంగా నా భూమి-నాదేశం, నేల తల్లికి నమస్కారం-వీరులకు వందనం కార్యక్రమాల గ్రామ సభలు బుధవారం నుంచి 14 వరకు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో శేషగిరిరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 9వ తేదీన మానికొండ, నందమూరు, ఉంగుటూరు, వెల్దిపాడు, పొణుకుమాడు, వేమండ, 10న పెద అవుటపల్లి, ఇందుపల్లి, ఆముదాలపల్లి, వెన్నూతల, ఎలుకపాడు, తరిగొప్పల, 11న తేలప్రోలు, ముక్కపాడు, కొయ్యగూరపాడు, పొట్టిపాడు, ఎస్వీ పేట, నాగవరప్పాడు, మధిరపాడు, 14న ఆత్కూరు, వేంపాడు, లంకపల్లి, గారపాడు, తుట్టగుంట, బొకినాల, చికినాల, చాగంటిపాడు గ్రామ పంచాయతీ కార్యాలయాల వద్ద గ్రామ సభలు నిర్వహించనున్నట్లు వివరించారు.

గన్నవరం: ప్రజల్లో దేశభక్తిని ప్రేరేపించేందుకు మండలంలో ఆజాదీకా అమృత్ మహోత్సవ్ కార్యక్రమంలో భాగంగా నా భూమి-నా దేశం నెల తల్లికి నమస్కారం వీరులకు వందనం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో ఈ. సత్యకుమార్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 9న కొండపావులూరు, అల్లాపురం, వీరపనేనిగూడెం, కేసరపల్లి, బుద్ధవరం, 10న గన్నవరం, అజ్జంపూడి, బూతిమిల్లిపాడు,సావరగూడెం, సూరంపల్లి, పురుషోత్తపట్నం గ్రామాల్లో జరగనున్నట్లు పేర్కొన్నారు. 11న చిన్నఆవుటపల్లి, కొత్తగూడెం, మాదలవారిగూడెం, జక్కులనెక్కలం, చిక్కవరం, 14న ముస్తాబాద, గొల్లనపల్లి, గోపవరపుగూడెం, బీబీ.గూడెం, తెంపల్లి గ్రామాల్లో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాలను విజయ వంతం చేయాలని కోరారు.

నేటి నుంచి జెండా పండుగ విజయంతం చేయాలి

పెనమలూరు: మండల పరిధిలో బుధవారం నుంచి నాభూమి-నాదేశం కార్యక్రమం నిర్వహిస్తామని ఎంపీడీఓ సునీతాశర్మ అన్నారు. ఆమె మంగళవారం వివరాలు తెలుపుతూ ఆజాదికా అమృత్ మహోత్సవ్ వేడుకల్లో భాగంగా నాభూమి-నాదేశం, నేలతల్లికి నమస్కారం, వీరులకు వందనం కార్యక్రమాలు 15వ తేదీ వరకు గ్రామాల్లో నిర్వహిస్తామన్నారు. అమరవీరులు, యుద్ధ వీరులకు నివాళులర్పించటం, దేశభక్తి పెంపొందించటం, శిలాఫలకాలపై అమరవీరులు, స్వాతంత్య్ర సమరయోధుల పేర్లు, ప్రముఖుల సూక్తులు రాయటం, ఇలా అనేక కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఆయా గ్రామాల ప్రజలు ఈ కార్యక్రమాల్లో పాల్గొనాలని సూచించారు.

ఏడు టిప్పర్లు సీజ్

గన్నవరం: అక్రమంగా గ్రావెల్, కంకర తరలిస్తున్న ఏడు టిప్పర్లను మంగళవారం మైనింగ్ శాఖ అధికారులు సీజ్ చేశారు. వివరాలీలా ఉన్నాయి. జిల్లా వ్యాప్తంగా మైనింగ్ శాఖ నిర్వహించిన ప్రత్యేక డ్రైవ్‌లో భాగంగా వెదురుపావులూరు వద్ద ఆ శాఖ అధికారులు తనిఖీలు నిర్వహించారు. అదే సమయంలో వేబిల్లులు లేకుండా గ్రావెల్ తరలిస్తున్న మూడు టిప్పర్లను, మరో నాలుగు కంకర లోడుతో వెళ్తున్న టిప్పర్లను సీజ్ చేసినట్లు మైనింగ్ శాఖ ఏజీ కొండారెడ్డి తెలిపారు. అనంతరం సీజ్ చేసిన టిప్పర్లను గన్నవరం పోలీస్ స్టేషన్‌లో అప్పటించినట్లు చెప్పారు. జిల్లా వ్యాప్తంగా జరిగిన తనిఖీల్లో 11 వాహనాలను సీజ్‌చేసినట్లు తెలిపారు.

అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యం స్వాధీనం

ఇద్దరిపై కేసు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యాన్ని తరలించడానికి సిద్ధం చేసిన గోడౌన్‌పై జాయింట్ కలెక్టర్ సంపత్‌కుమార్, జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారులు దాడి చేశారు. రామరాజ్యనగర్‌లోని ఓ గోడౌన్‌లో రేషన్ బియ్యం అక్రమంగా నిల్వ చేసినట్లు జేసీకి సమాచారం అందింది. జేసీ జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారులతో కలిసి గోడౌన్‌పై దాడి చేశారు. సుమారు 232 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని లారీలో తరలించేందుకు సిద్ధంగా ఉంచడంతో వారిని అదుపులోకి తీసుకున్నారు. పెంకే రాంబాబు అనే వ్యక్తితో పాటు లారీ యజమాని బాలస్వామిను అదుపులోకి తీసుకుని వారిపై 6-ఏ కేసు, క్రిమినల్ కేసులు నమోదు చేశారు.

వైభవంగా సహస్ర నామ పారాయణం

విజయవాడ కల్చరల్: శ్రీ శృంగేరీ పీఠపాలిత శివరామకృష్ణ క్షేత్రంలో మంగళవారం శృంగేరీ పీఠాధిపతి భారతీ తీర్థ మహాస్వామి ఆదేశంతో శ్రవణ సదనంలో లోక కల్యాణార్థం శ్రీ మహావిష్ణువు లక్షతులసి అర్చన, విష్ణు గాయత్రి సహిత పూర్వక సహస్ర నామ, విష్ణుకవచ పఠన కార్యక్రమాన్ని అర్చకులు వైభవంగా నిర్వహించారు. దేవాలయ ప్రాంగణంలోని శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయంలో ఉదయం ప్రత్యేక ప్రజలు నిర్వహించారు. ధర్మాధికారి హనుమత్ ప్రసాద్ మాట్లాడుతూ శ్రావణమాసం విష్ణువుకు అత్యంత ప్రియమైనదని నామ పారాయణ, లక్ష తులసి అర్చనతో సర్వపాపాలు హరిస్తాయని తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఎన్‌సీసీ క్యాడెట్ల క్విట్ ఇండియా డే ర్యాలీ



ర్యాలీని ప్రారంభిస్తున్న కళాశాల డైరెక్టర్ వేమూరి బాబూరావు, ప్రిన్సిపాల్ రమేష్

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): యువత దేశభక్తిని పెంపొందించుకుని ఉద్యోగ రీత్యా విదేశాలకు వెళ్లిన సమయంలో మనదేశ గొప్పదనాన్ని అక్కడ చాటాలని సిద్ధార్థ కళాశాల డైరెక్టర్ వేమూరి బాబూరావు సూచించారు. క్విట్ ఇండియా డే సందర్భంగా మంగళవారం పీబీ సిద్ధార్థ కళాశాల నాలుగో ఆంధ్రా బాలికల బెటాలియన్ ఆధ్వర్యంలో ఎన్‌సీసీ క్యాడెట్లు మంగళవారం ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని బాబూరావు, రమేష్ జెండా ఊపి ప్రారంభించారు. విదేశీ వస్తువులు, వస్త్రాలు వద్దు.. స్వదేశీ వస్తువులను ఉపయోగించండి అంటూ విద్యార్థులు ప్లకార్డులు చేబూని నినాదాలు చేశారు. అనంతరం కళాశాల ఆవరణలోని హాలులో క్విట్ ఇండియా ఉద్యమం వివరాలు తెలియజేస్తూ డాక్యుమెంటరీ ప్రదర్శించారు. నాలుగో ఆంధ్రా గరల్స్ లెఫ్టినెంట్ రోహిణి కుసుమ, సిబ్బంది రామయ్య, చందన, వసీమ, వైష్ణవి, జ్యోతిక తదితరులు పాల్గొన్నారు. సిద్ధార్థ కళాశాల పరిసర ప్రాంతాల్లో ర్యాలీ కొనసాగింది.

ఎన్‌సీసీ క్యాడెట్ల ర్యాలీ

లబ్బీపేట(విజయవాడతూర్పు): క్విట్ ఇండియా మూమెంట్ డేను పురస్కరించుకుని నలంద ఎన్‌సీసీ క్యాడెట్లు మంగళవారం ర్యాలీ నిర్వహించారు. ఎన్‌సీసీ నాలుగో ఆంధ్రా బాలికల బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ బలేందర్ సింగ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ర్యాలీలో నలంద ఎన్‌సీసీ క్యాడెట్లు పాల్గొన్నారు. ఎన్‌సీసీ క్యాడెట్లు జాతీయ పతాకాలు చేబూని ఇందిరాగాంధీ మునిసిపల్ స్టేడియం నుంచి రెడ్‌సర్కిల్ వరకూ ర్యాలీ నిర్వహించారు. రెడ్‌సర్కిల్ వద్ద మానవహారం నిర్మించారు. క్విట్ ఇండియా మూమెంట్ డేలో భాగంగా స్వదేశీ వస్తువులను ప్రోత్సహించాలని సూచిస్తూ గుడ్డ సంచులను పంపిణీ చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎం.అనురాధ మాట్లాడుతూ.. గాంధీజీ నాయకత్వంలో చేపట్టిన క్విట్ ఇండియా ఉద్యమం స్వరాజ్యం సాధించాలన్న భారతీయుల ఆకాంక్షను బలంగా చాటిందన్నారు. ఎన్‌సీసీ నాలుగో ఆంధ్రా బాలికల బెటాలియన్ పీఐ స్టాఫ్ నాయక్ కుందన్, ఆ కళాశాల ఎన్‌సీసీ ఏఎన్ఓ ఎస్‌కే రఫియాబేగం తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ విజిలెన్స్ అధికారుల తనిఖీ



అధికారులకు సూచనలు ఇస్తున్న ఈఈ హరిబాబు

గన్నవరం: మండలంలో విద్యుత్ విజిలెన్స్ అధికారులు మంగళవారం విస్తృత తనిఖీలు నిర్వహించారు. గుణదల డివిజన్ ఆపరేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పి.హరిబాబు నేతృత్వంలో విజిలెన్స్, ఆపరేషన్ అధికారులు ఈ తనిఖీలు చేపట్టారు. మండల వ్యాప్తంగా 21 గ్రామ పంచాయతీల్లో 2,701 సర్వీసులను 39 బృందాలుగా తనిఖీలు చేశారు. అధికలోడు వినియోగిస్తున్న 99 సర్వీస్‌లను గుర్తించి రూ. 5.58 లక్షలు అపరాధ రుసుం విధించినట్లు హరిబాబు తెలిపారు. విద్యుత్ చౌర్యం సామాజిక నేరమని తెలిపారు. విద్యుత్ చోర్యానికి సంబంధించి ఎటువంటి సమాచారం తెలిసినా 94931 74266, 94408 12091 నంబర్లకు ఫోన్‌చేసి తెలియజేయాలని కోరారు. విద్యుత్ విజిలెన్స్ డీఈఈ బీ.నవీన్‌కుమార్, ఆపరేషన్ డీఈఈ జే.బాలాజీ, ఏఈఈ ఎం.వెంకటరాజు, జేఈ ఎంవీ.రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

సెల్ టవర్ నిర్మాణం నిలిపివేయండి

కంకిపాడు: సెల్ టవర్ నిర్మాణాన్ని వ్యతిరేకిస్తూ చలివేంద్రపాలెం వాసులు నిరసన చేపట్టారు. ఎలాంటి అనుమతులు లేకుండా ఇళ్ల మధ్య నిర్మిస్తున్న సెల్ టవర్‌ను నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ గ్రామస్తులు మంగళవారం ఆందోళనకు దిగారు. గ్రామస్తులు మాట్లాడుతూ ఇళ్ల మధ్య పంచాయతీ అనుమతులు లేకుండా, ఎలాంటి సమాచారం తెలియజేయకుండా ఓ సెల్ ఫోన్ సంస్థ సెల్ టవర్ నిర్మిస్తోందన్నారు. సెల్ టవర్ ఏర్పాటుతో ఎదురయ్యే సమస్యలపై ఇది వరకే స్పందనలో ఫిర్యాదు చేశామన్నారు. ఫిర్యాదు విచారణ దశలో ఉండగానే సెల్ టవర్ నిర్మాణాన్ని కొనసాగించటంతో అడ్డుకున్నామన్నారు. గ్రామానికి దూరంగా సెల్ టవర్ ఏర్పాటు చేసుకోవాలని, ఇళ్ల మధ్య ఏర్పాటు చేస్తే ఊరుకోమని హెచ్చరించారు. సెల్ టవర్ నిర్మాణాన్ని అడ్డుకుంటామని స్పష్టంచేశారు. గ్రామస్తుల ఆందోళనకు మద్దతుగా సర్పంచ్ బొమ్మారెడ్డి శివనాగిరెడ్డి, మాజీ సర్పంచ్ కొండా రామిరెడ్డి, అవుతు రామకోటిరెడ్డి, బి.సీతామహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



చలివేంద్రపాలెంలో నిరసన తెలుపుతున్న గ్రామస్తులు

వార్డు ఉప ఎన్నికకు నామినేషన్ల స్వీకరణ

నున్న(విజయవాడరూరల్): నున్న గ్రామం 9వ వార్డు ఉప ఎన్నికకు మంగళవారం నామినేషన్ల స్వీకరణ ప్రారంభమైంది. రిటర్నింగ్ అధికారి సీహెచ్ శ్రీనివాసరావు గ్రామ పంచాయతి కార్యాలయంలో అభ్యర్థి దండు సుబ్రహ్మణ్యంరాజు నుంచి నామినేషన్ స్వీకరించారు. 9వ వార్డులో 827 ఓటర్లు ఉన్నారని రిటర్నింగ్ అధికారి తెలియజేశారు. నామినేషన్లు స్వీకరణలో గ్రామ పంచాయతి కార్యదర్శి జీటీవీ రమణ కూడా పాల్గొన్నారు.

కంకిపాడు: స్థానిక సంస్థల ఉప ఎన్నిక నిర్వహణకు నామినేషన్ల ప్రక్రియ మంగళవారం నిర్వహించారు. మండలంలోని తెన్నేరు (7వ వార్డు ఎస్సీ), ప్రొద్దుటూరు (4వ వార్డు జనరల్), కంకిపాడు (9వ వార్డు జనరల్) స్థానాలకు ఉప ఎన్నిక నిర్వహించాల్సి ఉంది. తెన్నేరు, ప్రొద్దుటూరు వార్డు సభ్యులు మృతి చెందగా, కంకిపాడు 9వ వార్డు సభ్యుడు తన పదవికి రాజీనామా చేయటంతో ఉప ఎన్నిక అనివార్యమైంది. తొలి రోజు నిర్వహించిన నామినేషన్ల ప్రక్రియలో నామినేషన్లు దాఖలు కాలేదు. ఆయా గ్రామాలకు ఎన్నికల అధికారులుగా వెంకటేశ్వరరావు (తెన్నేరు), శరాబందిరాజు (ప్రొద్దుటూరు), సీతారామరాజు (కంకిపాడు)కు నియమితులయ్యారు. ఇన్‌చార్జి ఎంపీడీఓ టీ.ఉదయ్‌భాస్కర్ మాట్లాడుతూ ఈనెల 11వ తేదీన నామినేషన్ల పరిశీలన, 12న అభ్యంతరాలు స్వీకరణ, 13న అభ్యంతరాల పరిశీలన, 14న అభ్యర్థుల జాబితా ప్రకటన ఉంటుందన్నారు. ఎన్నిక అనివార్యమైతే 19వ తేదీ ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ పోలింగ్ నిర్వహిస్తామన్నారు. అదే రోజు మధ్యాహ్నం 2 గంటల తరువాత ఓట్ల లెక్కింపు.. ఫలితాల వెల్లడికి చర్యలు తీసుకుంటున్నామని వివరించారు.

అంబేడ్కర్ స్మృతివనం పనులపై సమీక్ష

పటమట(విజయవాడతూర్పు): నగరంలోని స్వరాజ్య మైదానంలో జరుగుతున్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం, స్మృతివనం పనులను వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ మంగళశారం సమీక్షించారు. కమిషనర్ బంగ్లాలో జరిగిన ఈ సమీక్షలో క్వాలిటీ కంట్రోల్ అధికారులు, ఏపీఐఐసీ అధికారులు, కేపీసీ ప్రాజెక్ట్ కాంట్రాక్టర్లతో జరిగిన ఈ సమీక్షలో ఆయన మాట్లాడతూ అంబేడ్కర్ స్మృతి వనం పనులు మరింత వేగంగా జారగాలని సూచించారు. కొన్ని రోజులుగా రాత్రి పూట పనుల్లో జాప్యం జరుగుతోందన్నారు. మిగిలిన పనులు త్వరితగతిన పూర్తి చేయాలని కమిషనర్ ఆదేశించారు. రాత్రిపూట జరిగే పనుల వివరాలు తెలుసుకున్న ఆయన పెయింటింగ్ కూడా ప్రారంభించాలని సూచించారు.



స్మృతివనంపై సమీక్షిస్తున్న వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్యామలాంబకు ప్రత్యేక పూజలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): అధిక శ్రావణంలో మంగళవారం సందర్భంగా దావు బుచ్చయ్యకాలనీలోని శ్రీ శ్యామలాంబదేవి దేవాలయంలో ప్రత్యేక పూజలు అభిషేకాలు జరిగాయి. సాయంత్రం భజన మండలితో పారాయణం, లచన్ ఇన్‌ఫ్రా మహిళలతో లలితా సహస్రనామ పారాయణం చేశారు. కార్యక్రమాలను ఆలయ ధర్మకర్త చింతపల్లి కనకారావు పర్యవేక్షించారు